నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది(దత్తపది)

(గో)పకులమునందు గోవిందుడు నెపుడు
(దా)చుకున్నవాని దోచుకొనెను
(వ)నితలెల్లకలిసి పట్టుకొనగ నతడు
(రి)వ్వుమనుచు నురికె గువ్వవోలె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 193 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 22-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




# పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం,భరోసా



## అమరులను సంస్మరించుకోవడం మన విధి

- విధి నిర్వహణలోఎందరో పోలీసుల ప్రాణార్పణం
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- నిజామబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా రేవంత్ నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహాల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు సీఎం నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు.

-మిగతా 2 లో





# బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్

- కిషన్ రెడ్డి, రామచంద్రరావుతో కలిసి వచ్చిన దీపక్
- ముగిసిన నామినేషన్ల పర్వం

హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ ఆలయంలో దీపక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా షేక్‌పేట తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

-మిగతా 2 లో



# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

- అయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి
- ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో మోడీ ప్రస్తావన

న్యూఢిల్లీ, -అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)


దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల

-మిగతా 2 లో

# ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం

## బిల్లుల కోసం సచివాలయం ముందు ధర్నాలు

- చిన్నకంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ప్రజారోగ్యం విస్మరించి..బస్తీదవాఖానలపై నిర్లక్ష్యం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్ అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

పరిపాలన కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్ లా మారిందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మొన్న చిన్న కాంట్రాక్టర్లు సచివాలయం లోపల ధర్నా చేస్తే.. బిల్లులు చెల్లించాలంటూ ప్రభుత్వ అద్దె వాహన యజమానులు సచివాలయం ఎదుట ఆందోళన చేసిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ పాలనకు నిదర్శనమిదీ అని అన్నారు. కమిషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్లు, చిరు ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులు, జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం శోచనీయమని

-మిగతా 2 లో

# జూబ్లీహిల్స్ ప్రచారం కోసం స్టార్ కాంపెయినర్లు

- 40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ
- జాబితాలో మాజీ సీఎం కేసీఆర్ పేరు




హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్ కుమార్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు..

-మిగతా 2 లో

# విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

- మాది ఫ్రెండ్లీ గవర్నమెంట్ - సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్...
- మంత్రి అడ్లూరి చేతుల మీదుగా గ్రూప్ 2 అభ్యర్థులకు ఏఎస్ డబ్ల్యూ ఓలుగా నియామక పత్రాలు అందజేత ...
- హాజరైన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎస్సిడిడి సెక్రటరీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఎస్సిఎస్ సభ్యసాచి ఘోష్



హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని, సీఎం అవలంబిస్తున్న ఫ్రెండ్లీ గవర్నమెంట్ పరిపాలనకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ అన్నారు. గ్రూప్ 2 పోటీ పరీక్షల్లో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులుగా నియమితులైన అభ్యర్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని ఎస్సీ డెవలప్మెంట్

-మిగతా 9 లో



# జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకాయిచి

- ఎన్నుకున్న జపాన్ పార్లమెంట్

టోక్యో, -అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

జపాన్ తొలి మహిళా ప్రధానిగా అతివాద నేతగా పేరున్న సనే తకైచి ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం దేశంలోని తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకైచికి ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ- జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమితో.. తకైచికి భారీ మద్దతు లభించింది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో

-మిగతా 2 లో

# చైనాకు ట్రంప్ వార్నింగ్

- అప్పటిలోగా ఒప్పందం చేసుకోండి.
- లేదంటే 155 శాతం సుంకాలు విధిస్తా..




వాషింగ్టన్ -అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బెదిరింపులకు దిగారు. రష్యాతో చమురు వ్యాపారం ముగించకుంటే భారత్ భారీగా సుంకాలు చెల్లించాల్సి వస్తుందన్న ట్రంప్.. తాజాగా చైనాను హెచ్చరించారు. నవంబర్ 1వ తేదీ లోగా అమెరికాతో న్యాయమైన వాణిజ్య ఒప్పందం కుర్చుకోకపోతే బీజింగ్‌పై సుంకాలు 155 శాతానికి పెంచుతానంటూ వార్నింగ్ ఇచ్చారు. చైనాకు అమెరికాపై అపార గౌరవ ఉందని, అందుకే ఎక్కువ టారిఫ్‌లు చెల్లిస్తున్నదంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. అమెరికా.. ఆస్ట్రేలియాతో 8.5 బిలియన్ డాలర్ల అరుదైన ఖనిజాల ఒప్పందం కుదుర్చుకున్నది. సోమవారం ఆ దేశ ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌తో వైట్‌హౌస్‌లో భేటీ అయిన ట్రంప్.. ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చైనా ఇప్పటికే 55 శాతం సుంకాలు చెల్లిస్తున్నది. జిన్‌పింగ్‌తో

-మిగతా 2 లో

# శాంతి భద్రతలు ఉంటేనే రాష్టానికి పెట్టుబడులు

- పోలీసులకు సవాల్‌గా మారిన సోషల్ మీడియా నేరాలు
- పోలీస్ అమరవీరుల దినోత్సవంలో సిఎం చంద్రబాబు



అమరావతి అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)

శాంతి భద్రతలుంటేనే పెట్టుబడులు సాధ్యమని, రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలపై విశ్వాసంతోనే గూగుల్ వంటి పెద్ద ఐటి కంపెనీ రాష్ట్రానికి వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శాంతి భద్రతలను రక్షించడంలో పోలీస్‌శాఖ కీలకపాత్ర పోషించాలన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం

-మిగతా 2 లో

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

బుధవారం 22 అక్టోబర్ 2025

## ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం

(మొదటి తరువాయి)

హరీశ్‌రావు విమర్శించారు. వాహన అద్దె బిల్లులు హైదరాబాద్‌లో 10 నెలలుగా, జిల్లాల్లో 2 సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. కమిషన్లు ఇవ్వడం లేదని అద్దె వాహనాల బిల్లులు చెల్లించడం లేదా అని నిలదీశారు. యజమానుల కష్టాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే అదదె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే కేసీఆర్‌పై కోపంతో కేసీఆర్ కిట్‌లు తీసేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పేదల ఆరోగ్యంపై రేవంత్‌కు శ్రద్ధ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని మండిపడ్డారు. శేరిలింగంపల్లిలో బస్తీ దవాఖానను హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయి, వైద్య పరికరాలు పనితీరు, వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జీతాలు అందుతున్నాయా అని సిబ్బందిని అడగడంతో.. నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని తమ కష్టాలను హరీశ్ రావుతో చెప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ బస్తీ దవాఖానలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదని చెప్పారు. గ్రీన్ చానల్ మాటలకే పరిమితమయిందని విమర్శించారు. ఈహెచ్ఎస్ కింద బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. బిల్లులను పెండింగ్ పెట్టడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. బస్తీ ప్రజలకు తమ గడప దగ్గరే వైద్యం అందించాలనే ఉద్దేశంతో.. నాడు కేసీఆర్ గారు రాష్ట్రం మొత్తంలో 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. వాటిలో 110 రకాల మందులను, 134 రకాల టెస్టులను ఉచితంగా చేసేవారు. కానీ 22 నెలల కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకే సుస్తీ పట్టుకున్నది. లింగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానా సిబ్బంది తమకు 5-6 నెలల నుండి జీతాలు రావడం లేదని బాధపడుతున్నారు. నిత్యావసరమైన మందులు కూడా అందుబాటులో లేవు. రేవంత్ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. సీఎం రేవంత్ రెడ్డి కొత్త వైన్ షాపుల అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాదని విమర్శించారు. దరఖాస్తులు తక్కువ వచ్చాయని వారం రోజులు గడువు పెంచిందని మండిపడ్డారు.

## ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

(మొదటి తరువాయి)

ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.

## బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్

(మొదటి తరువాయి)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు చివరి రోజు కావడంతో అతను నామినేషన్ వేశారు.. మంగళవారం సాయంత్రంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది. ఉప ఎన్నికల్లో పోటీకి చివరిరోజులు పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 150కిపైగా నామినేషన్లు దాఖలవగా.. అభ్యర్థుల సంఖ్య 100 మార్క్‌ని దాటింది. మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్స్ వేశారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చివరిరోజున బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు. రేపటి నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సాయిరాం పరిశీలించనున్నారు. ఇక 24న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుండగా.. 14న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకాయిచి

(మొదటి తరువాయి)

సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. జపాన్ తొలి మహిళా ప్రధాని ఎన్నికైన సానే తకైచికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్-జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తకైచితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుల విషయంలో ఇరుదేశాల బంధాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

## చైనాకు ట్రంప్ వార్నింగ్

(మొదటి తరువాయి)

న్యాయమైన వాణిజ్య ఒప్పంద కుదరకపోతే ఆ సుంకాలు నవంబర్ 1 నుంచి 155 శాతానికి పెరుగుతాయని హెచ్చరించారు. అయితే చైనా పరస్పర రాయితీలు ఇస్తే సుంకాలను తగ్గించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.చాలా దేశాలు అమెరికాను సద్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. చైనా మాత్రం అమెరికాను సద్వినియోగం చేసుకోలేకపోతోందన్నారు. ఆ దేశంలోతో అద్భుతమైన వాణిజ్య ఒప్పందం కుదరనుందని భావిస్తున్నా. తద్వారా ఇరు దేశాలకు మాత్రమే కాకుండా ప్రపంచానికి కూడా మంచి జరుగుతుందని వెల్లడించారు. అమెరికాను ఎన్నో దేశాలు గతంలో దోపిడీ చేశాయని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండదన్నారు. అమెరికాను చైనా అరుదైన ఖనిజాలతో బెదిరించిందని, దాన్ని తాను సుంకాలతో తిప్పికొట్టానని చెప్పారు. చైనాతో తాను సత్సంబంధాలను కోరుకుంటున్నానని ట్రంప్ అన్నారు. వచ్చే ఏడాది జనవరిలో చైనాలో పర్యటించాలన్న ఆహ్వానాన్ని అంగీకరించానని చెప్పారు. జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మరో రెండు వారాల్లో దక్షిణ కొరియాలో ఆయనతో సమావేశం కానున్నట్లు చెప్పారు. కాగా, ఈ నెల 31 నుంచి దక్షిణ కొరియా వేదికగా ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకారం సమావేశం జరుగనుంది. దీనికి ముందే అక్టోబర్ 29, 30 తేదీల్లో ట్రంప్ అక్కడ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ కానున్నారు.

# పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా

(మొదటి తరువాయి)



ఆ బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయిస్టులనూ కోరుతున్నానని సీఎం తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు.గ్రేహౌండ్స్ కమాండోలు.. టి. సందీప్, వి.శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్‌లు సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందారని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారని అన్నారు. మూడు రోజుల కింద నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారని గుర్తుచేశారు. భర్త ప్రమోద్ ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి రూ.16 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ వెల్ఫేర్ నుండి రూ.8 లక్షలు ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. 29-06-2008 న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజులరామారంలో 200 గజాల స్థలం కేటాయించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించిందని ట్ తెలిపారు. అదేవిధంగా, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందిందని చెప్పారు. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలంగాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. డ్రగ్స్ దందా వెనక ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దు అనే ఆదేశాలను జారీ చేశాం. ఒకప్పటితో పోలిస్తే నేరాల స్వభావం మారుతోంది. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి.మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు పత్రికల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి.టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెబుతున్న తీరు భేష్.. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం.ఈ విభాగం అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది.సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని అన్నారు. తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి.కానీ నేడు పోలీస్ శాఖ చర్యల వల్ల శాంతి నెలకొంది.మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోయి దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం. విధినిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం.మెడికల్ సీట్ల లోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నాం. తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్ గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.మన ప్రాణానికి వారి ప్రాణాలను అడ్డుపెట్టే పోలీసుల రుణం ఏమిచ్చినా తీరదు.సమాజ శ్రేయస్సే ఊపిరిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒలంపియన్, బాక్సర్ నిఖత్ జరీన్, వరల్డ్ కప్ విన్నర్ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కు డీఎస్పీగా ఉద్యోగాలు ఇచ్చి తెలంగాణ పోలీసుల ప్రతిష్టతను పెంచాం.

## జూబ్లీహిల్స్ ప్రచారం కోసం స్టార్ క్యాంపెయినర్లు

(మొదటి తరువాయి)




వారికి వాహనాల అనుమతికి పాస్‌లను మంజూరు చేశారు. ఈ ఎన్నికల ప్రచారం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయిన్ల జాబితాలో ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ జాబితాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు సైతం ఉన్నది. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ శ్రీనివాస్ యాదవ్, వీ ప్రశాంత్ రెడ్డి, జీ జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్ నిరంజన్ రెడ్డి ఉన్నారు. మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వీ శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ సైతం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎం కృష్ణ రావు, కేపీ వివేకానంద గౌడ్, డీ సుధీర్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, చింతా ప్రభాకర్ సైతం స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. ఎమ్మెల్సీల్లో దాసోజు శ్రవణ్, ముఠా గోపాల్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టాటా మధుసూధన్, ఎల్ రమణా, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణు వర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ పేర్లు సైతం ఉన్నాయి.

## శాంతి భద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు

(మొదటి తరువాయి)

సందర్భంగా మంగళగిరి ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరయ్యారు. తొలుత పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పోలీస్ సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ ధరించి ఫ్లాగ్ ఫండ్‌కు విరాళం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీస్ అంటే ఓ బ్రాండ్ అని, దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో శాంతి భద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్నానన్నారు. ప్రతియేటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని, వారి త్యాగాలను, బలిదానాన్ని గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి పొందుతున్నామన్నారు. విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారని, వీరందరికీ నివాళు లర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్న పోలీసులంటే తనకు గౌరవమని, పోలీసులు చేసేది నిస్వార్థ సేవ అని కొనియాడారు. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతోనే పరిశ్రమలు, కంపెనీలు వస్తాయన్నారు. రాష్ట్ర పోలీసులు ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణచివేయడంలో ఎంతో పేరు తెచ్చుకున్నారని సిఎం అన్నారు. క్రిమినల్స్ అప్‌డేట్ అవుతున్నారని, వారి ఆట కట్టించాలంటే పోలీసుశాఖ కూడా అప్‌డేట్ కావాలన్నారు. సాంకేతికంగా పోలీస్ శాఖను బలోపేతం చేస్తున్నామని, సిసి టివి కెమెరాలు, డ్రోన్లు, ఫోన్ సిగల్స్, గూగుల్ టేకవుట్ వంటి టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీస్ ఆదర్శంగా నిలిచిందన్నారు. సమాజంలో అశాంతి సృష్టించి లబ్ధి పొందడం కోసం కొందరు రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లుగా తయారయ్యారన్నారు. వీళ్లు క్రిమినల్స్ కంటే అత్యంత ప్రమాదకరమని, మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. ఫేక్ ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, ఇలాంటి వారి విషయంలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న దుష్ప్రచారం, నేరాలు పోలీసులకు అతి పెద్ద ఛాలెంజ్ అని తెలిపారు. పోలీస్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ విజయానంద్, హోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**2025 అక్టోబర్ 22, బుధవారం తెలుగు పంచాంగం**




మాసం -పక్షం
కార్తీక మాసం ప్రారంభం
శుక్ల పక్షం
తిథి
ద్వితీయా: అక్టోబర్ 21 రాత్రి 11:27
అక్టోబర్ 22 రాత్రి 10:35 వరకు
తృతీయా: అక్టోబర్ 22 రాత్రి 10:35
అక్టోబర్ 23 రాత్రి 9:59 వరకు
నక్షత్రం
విశాఖ: అక్టోబర్ 21 రాత్రి 11:30 అక్టోబర్ 22 రాత్రి 10:17 వరకు
అనూరాధ: అక్టోబర్ 22 రాత్రి 10:17 అక్టోబర్ 23 రాత్రి 9:20 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:45 - 5:29
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:39 - 12:23
అమృతకాలం: ఉదయం 6:50 -8:25
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 12:01 - 1:30
యమగండం: ఉదయం 7:42 - 9:11
గుళికా: ఉదయం 10:40 - 12:01
దుర్ముహూర్తం: ఉదయం
8:00- 8:48, రాత్రి 10:05 - 10:54
వర్జ్యం: సాయంత్రం 7:55 - రాత్రి 9:25

# మాజీ ఉపసర్పంచ్ కుటుంబానికి బీజేపీ నేతల ఆర్థిక సాయం



**వెల్దండ, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో జరిగిన ఓ హృదయస్పర్శక కార్యక్రమం ప్రజల మనసులను తాకింది. భారతీయ జనతా పార్టీకి మూడు దశాబ్దాలుగా క్రమశిక్షణతో సేవలందించిన వెల్దండ గ్రామ మాజీ ఉపసర్పంచ్ చిమ్ముల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి వారి నివాసానికి చేరుకున్నారు. ఆచారి పార్టీ తరఫున తమ వంతు ఆర్థిక సాయంగా లక్ష రూపాయల చెక్కును శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా వారి పిల్లల విద్య కోసం రూ. 1,40,000 అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వారి సేవలను గుర్తు చేసుకుంటూ, పార్టీకి ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శేఖర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, మోహన్ రెడ్డి, మట్ట పరమేష్ గౌడ్, మట్ట విష్ణు గౌడ్, రవి కుమార్, శ్రీశైలం, దేవేందర్, కొండల్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ -కేశంపేట రోడ్ రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత



**షాద్‌నగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్‌నగర్ -కేశంపేట ప్రధాన రహదారిలోని రైల్వే గేట్ వద్ద రైల్వే లైన్ మరమ్మతు పనులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ గేట్‌ను నేటి నుండి అక్టోబర్ 24వ తేదీ వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమయంలో వాహనదారులు ఈ మార్గాన్ని ఉపయోగించకుండా, సమీప ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలని రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోంది.రైల్వే అధికారులు ప్రజల సహకారాన్ని కోరుతూ, తాత్కాలిక అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు.

# వైద్య విద్యార్థిని చదువుకు చేయూత



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
: నీట్‌లో మెరుగైన ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందినప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజు చెల్లించలేకపోతున్న విద్యార్థిని ఎమ్మె మౌనికకు బిఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జ్ క్యామ్ మల్లేష్ చేయూతనందించారు.యాచారం మండలంలోని గడ్డ మల్లయ్యగూడెం గ్రామానికి చెందిన ఎమ్మె మంగమ్మ కుమార్తె మౌనిక, కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందింది. ఆమె చదువుకు ఆర్థిక సహాయం అవసరమని తెలుసుకున్న స్థానిక నాయకులు, ఈ విషయం క్యామ్ మల్లేష్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో మౌనికను మర్యాదపూర్వకంగా కలిసిన మల్లేష్, ఆమెను ఘనంగా సన్మానించి రూ. 25,000 ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థిని ప్రతిభను గుర్తించి చేయూతనందించిన మల్లేష్‌కు మౌనిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ బాలికల వసతి గృహంలో ఘనంగా దీపావళి సంబరాలు





**యాచారం, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా దీపావళి సందడి నెలకొంది. యాచారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు నిర్వహించి, ఇండ్లు, దుకాణాలను దీపాలతో అలంకరించి, బాణాసంచాలు కాలుస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బీసీ బాలికల వసతి గృహంలో కూడా దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాచారం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్



నందీశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి బాలికలకు స్వీట్స్, క్రాకర్స్ పంపిణీ చేసి, వారితో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నందీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "ఉపాధ్యాయులు చెప్పినది వినండి, మంచిగా చదువుకోండి. మీ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలి" అని బాలికలను ఉద్దేశించి సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఎస్ఐలు మధు, సత్యనారాయణ, ప్రియాంక, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయాలు

**యాచారం, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




"పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి" అని యాచారం పోలీస్ స్టేషన్ సీఐ నందీశ్వర్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా యాచారం పోలీస్ స్టేషన్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది, ప్రవేట్ పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అమరవీరులకు జోహార్లు అర్పించారు.సీఐ నందీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "జీవితాన్ని పణంగా పెట్టి ప్రజల రక్షణ కోసం సేవలందించిన అమరవీరుల త్యాగాలను తరతరాలు గుర్తుంచుకోవాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు మండలంలో దీపావళి సందడి



**ఎలిగేడు, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా, సుఖసంతోషాలతో జరుపుకున్నారు. ఇంటింటా వెలుగులు నింపుతూ, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ ఉత్సాహంగా సాగింది. వ్యాపార దుకాణాల్లో ధనలక్ష్మి పూజలు నిర్వహించగా, గృహాలలో కేదారి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నా -పెద్దా అంతా కలిసి టపాసులు పేల్చి, ఆనందోత్సాహాలతో సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగుల పండుగకు ప్రత్యేక మానవీయతను జోడిస్తూ, ప్రజలు పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# ఎల్లమ్మబండ స్మశానవాటిక అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. సుమారు యాభై లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న బర్నింగ్ ఫ్లాట్ ఫారం స్లాబు పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఉంది. అంతిమయాత్రలో ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న టాయిలెట్ బ్లాక్, సిట్టింగ్ గ్యాలరీ, పూజగది, వాచ్‌మాన్ రూమ్ పనులను త్వరలో పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, ఆంజనేయ ప్రసాద్ గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కేశవులు

**ఆమనగల్లు, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



చీకట్లను తొలగించి వెలుగులు నింపే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో వెలుగులు పంచాలని, ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, శ్రేయస్సు నిండాలని ఆయన అభిలషించారు.వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా సోమవారం ఉదయం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి, విజయాలను తెచ్చిపెట్టాలని కేశవులు ఆకాంక్షించారు.

# అట్టహాసంగా ప్రారంభమైన ఉమ్మడి జిల్లా చదరంగ పోటీలు



**పెద్దపల్లి, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ చదరంగ పోటీలు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 14 సంవత్సరాల వయస్సు గల బాలబాలికల కోసం నిర్వహించిన ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ ప్రారంభించారు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన 40 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, “చదరంగం గొప్ప ఆలోచనా శక్తిని పెంపొందించే క్రీడ. ఇది ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తిని అభివృద్ధి చేస్తుంది. గెలుపోటములను సమానంగా తీసుకోవాలి. ఓడినప్పుడు కసి పెంచుకొని మళ్లీ గెలవడానికి ప్రయత్నించాలి” అని సూచించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు వచ్చే నెలలో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గడ్డాలా శ్రీనివాస్, అర్బిటర్ కర్ణాకర్ రెడ్డి, ఓదెల -ఎలిగేడ్ మండలాల చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం నాగరాజు, తాటిపల్లి సతీష్ బాబు, భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటేష్, ఖాజాబీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్



**ఆమనగల్లు, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామీణ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తమలోని క్రీడా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో డీకేపీఎస్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో సర్కిల్ హిట్టర్స్ జట్టు విజేతగా నిలవగా, జి జి గ్లాడియేటర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు మీసాల గోపి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీకేపీఎస్ డ్యాన్స్ అకాడమీ ఫౌండర్ ప్రభుశంకర్ మాస్టరు మాట్లాడుతూ, “యువతను సానుకూల దిశలో ప్రేరేపించేందుకు, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహించాం” అని తెలిపారు. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడంలో సహకరించిన గోరటి దేవేందర్, నీరటి (కొత్త) రాజు, వరికుప్పల రాజు, కోరే మహేందర్, ఎనుమల్ల రమేష్, వస్పుల రంజిత్, కొమ్ము ప్రసాద్, తల్లోజు నరసింహ, రామకృష్ణ, వస్పుల సురేష్ తదితరులకు, అలాగే క్రీడాకారులు, అభిమానులకు ప్రభుశంకర్ మాస్టరు ధన్యవాదాలు తెలిపారు.

## మెడికల్ సీటు సాధించిన సాయిదీపికకు ఘన సన్మానం



**ఆమనగల్లు, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆమనగల్లు పట్టణానికి చెందిన పెరికేటి సుజాత -యాదయ్య దంపతుల కుమార్తె సాయిదీపికను మంగళవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు స్వీటు తినిపించి, వినాయకుడి చిత్రపటాన్ని బహుకరించారు. చిన్ననాటి నుంచే చదువులపై ఆసక్తి చూపుతూ అన్ని స్థాయిల పరీక్షల్లో రాణించిన సాయిదీపిక ప్రతిభను సంఘ నాయకులు ప్రశంసించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ, “కులవృత్తిపై ఆధారపడి పిల్లలను చదివించడం ప్రతి కుటుంబానికి ఆదర్శంగా నిలవాలి” అని పేర్కొన్నారుకార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం, మండల అధ్యక్షుడు కానుగుల గణేష్, పట్టణ అధ్యక్షుడు దేవరకొండ రమేష్, ప్రధాన కార్యదర్శి గుద్దేటి బాలు, దేవరకొండ నాగేష్, పెరికోటి కోటి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్ కాలనీ సమస్యలపై వాసుల ఆవేదన



**ఆమనగల్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ పట్టణంలోని 9వ వార్డ్ విద్యానగర్ కాలనీ అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతుండటంతో, స్థానికులు మౌలిక వసతుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర శివార్లలోని ఇతర ప్రాంతాల మాదిరిగా ఇక్కడ కూడా ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతున్నప్పటికీ, తాగునీటి సరఫరా, విద్యుత్ భద్రత, వీధిదీపాలు, రోడ్లు, మురుగు కాలువలు వంటి అవసరమైన వసతులు లేకపోవడం ప్రజలను తీవ్రంగా బాధిస్తోంది. ప్రస్తుతం విద్యానగర్ కాలనీలో సుమారు 120 కుటుంబాలు, దాదాపు 750 మంది జనాభా నివసిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కేవీఆర్ వెంచర్ వరకు విస్తరించిన ఈ ప్రాంతంలో ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. కృష్ణా నీటి సరఫరా లేక తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇళ్ల మధ్యగా ప్రమాదకరంగా వెళ్తున్న విద్యుత్ లైన్లు భద్రతకు ముప్పుగా మారాయి. వీధిదీపాల లేమితో రాత్రిపూట బయటకు వెళ్లాలంటే భయాందోళన నెలకొంది. అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం కూడా అత్యవసరంగా అవసరమై ఉంది. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతూ, మున్సిపాలిటీ కమిషనర్‌కు విద్యానగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. కాలనీ యూత్ ప్రెసిడెంట్ ఉదయ్ కిరణ్, వర్కాల వంశీ, మాడుగుల అరుణ్, చత్రపతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిని పట్టుకున్న కరీంనగర్ పోలీసులు




**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మానేరు నది, నగునూరు వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని కరీంనగర్ రూరల్ పోలీసులు చాగచక్కగా పట్టుకున్నారు. అక్టోబర్ 20న జరిగిన ఈ ఘటనలో బొమ్మకల్ గ్రామానికి చెందిన గన్ను రాకేష్ రెడ్డి, పోగుల సంపత్ తమ ట్రాక్టర్, ట్రైలర్లలో మానేరు నది నుంచి ఇసుక తరలిస్తుండగా బొమ్మకల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అలాగే నగునూరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒల్లేపు అజయ్‌ను నగునూరు వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇలాంటి అక్రమ రవాణా పునరావృతమైతే ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని అమరవీణ స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, అమరవీరుల సేవలను స్మరించారు. డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, “పోలీసుల సేవలు సమాజానికి అత్యంత విశిష్టమైనవి. వారి ద్వారానే మతసామరస్యాన్ని సంరక్షిస్తూ, శాంతిభద్రతలను నెలకొల్పుతూ సమాజ అభివృద్ధికి నిరంతరంగా చేయూతనిస్తున్నారు” అని పేర్కొన్నారు. కార్యాలయాల రక్షణ, చట్ట అమలు, నేరాల నియంత్రణ, దర్యాప్తు, విపత్తుల సమయంలో సహాయం, ట్రాఫిక్ నిర్వహణ వంటి విభాగాల్లో పోలీసుల సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. “పోలీసుల సేవలు యువతకు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా చేయూతనివ్వడం స్ఫూర్తిదాయకం. ప్రతి ఒక్కరూ అమూల్యమైన పోలీసు కుటుంబాలకు అండగా ఉండాలి, వారి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలి” అని సూచించారు. ఈ కార్యక్రమంలో విఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరుల వారోత్సవాల్లో భాగంగా రక్తదాన కార్యక్రమం



**భూపాలపల్లి, మహాముత్తారం అక్టోబర్ 21:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద పోలీస్ అమరుల వారోత్సవంలో భాగంగా రక్తదాన కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగింది . ఈ సందర్భంగా మహాముత్తారం మండల నుండి అట్టెం రమేష్ ముదిరాజ్ తో పాటు , మహాముత్తారం మండలం లోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహాముత్తారం ట్రైనింగ్ మహేష్ ఎస్ ఐ,కానిస్టేబుల్ హుస్సేన్ , యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కురుమూర్తి జాతరకు భారీగా నల్లమల పొడ జాతి పశువులు




**అమ్రాబాద్, అక్టోబర్ 21**
నాగర్‌కర్నూల్ జిల్లా పదర, అమ్రాబాద్ మండలాల పరిసర అటవీ ప్రాంతాల్లో పెంపకం పొందుతున్న నల్లమల తూర్పు పొడ జాతి పశువులకు కురుమూర్తి జాతర సందర్భంగా భారీ డిమాండ్ నెలకొంది. మచ్చలతో ఆకర్షణీయంగా కనిపించే ఈ జాతి పశువులు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వ్యాపారులను ఆకట్టుకుంటున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు కర్నూల్, అనంతపురం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి వ్యాపారులు ఈ జాతి పశువులను కొనుగోలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కురుమూర్తి జాతరలో ప్రతి సంవత్సరం వీటి కొనుగోలు ఉత్సాహంగా సాగుతుంది. ఒక్కో జతకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతోంది. తూర్పు జాతి పశువులు మేత తక్కువ తిని, ఎక్కువ పని చేసే సామర్థ్యం కలిగి ఉంటాయి. పెద్ద గుట్టలను అలవోకగా ఎక్కగలవు, రాళ్లపై నడిచినా గెట్టెలు మెత్తబడవు. నీళ్లలో ఈదగలవు. పాలు ఇవ్వడంతో పాటు పొలం పనుల్లోనూ ఉపయోగపడతాయి. మచ్చలతోపాటు ఊపురం, కొమ్ము పెట్టు వంటి లక్షణాల ఆధారంగా వీటి విలువ నిర్ణయించబడుతుంది. భారత ప్రభుత్వం 2020 మార్చిలో ఈ తూర్పు పొడ జాతిని 44వ జాతీయ పశువుగా గుర్తించింది. జాతీయ పశు జన్యు వనరుల బోర్డు ఈ గుర్తింపును ప్రకటించింది.

## గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తల్లోజు ఆచారి



**హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను సోమవారం ఉదయం మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై గవర్నర్‌తో చర్చించారు. తదనంతరం తన కుమారుని నిశ్చితార్థ వేడుకకు రావాలని ఆహ్వానించగా, గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం



**కడ్తాల్, అక్టోబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
అక్టోబర్ 21న పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించి, వారి స్మరణార్థం రెండు నిమిషాల మౌనం పాటించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో సేవా దృక్పథంతో పనిచేయాలని పోలీసులు సంకల్పబద్ధంగా ఉండాలని సీఐ గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

# టపాసుల సవ్వడి.. దీపావళి వెలుగులు




-దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
-కడ్తాల్ మండల వ్యాప్తంగా దీపావళి సంబరాలు



**కడ్తాల్, అక్టోబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల వ్యాప్తంగా దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాల్లో పండుగ అంగరంగ వైభవంగా జరుగింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, పిండి వంటల విందులతో జనం సందడి చేశారు. సాయంత్రం నుంచి టపాసుల సవ్వడి మొదలైంది. చిన్న పిల్లల దగ్గరి నుంచి వృద్ధుల వరకు టపాసులు పేల్చి సంతోషించారు. ఇక, దీపాల కాంతుల్లో ప్రతీ హిందూ గృహం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మైసిగండి మైసమ్మ ఆలయం, మక్తమాధారం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం దీపాల కాంతులతో వెలిగిపోయాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్, సింగల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ఆనంద్, ఆయా గ్రామాల్లో మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించారు.

# మామిడాకులు తెంపుతుండగా చెట్టు నుంచి పడిపోయి వ్యక్తి మృతి

**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలంలోని తీగలగుట్టపల్లి గ్రామం సరస్వతి నగర్‌కు చెందిన పాకాల కోమల్ రెడ్డి (25) దీపావళి పండుగ సందర్భంగా మామిడాకులు తెంపేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి వెల్లడించారు.

# పోలీసుల చాకచక్యంతో పోయిన ఫోన్ తిరిగి యజమానికి



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బొమ్మకల్ హాస్టల్‌లో పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి యజమానికి తిరిగి అప్పగించారు. సెప్టెంబర్ 23న లక్ష్మీనరసింహ అనే వ్యక్తి తన రియల్‌మీ ఫోన్ పోయినట్లు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతిక పద్ధతుల ద్వారా ఫోన్ నల్గొండలో ఉన్నదని గుర్తించి రికవరీ చేశారు. మంగళవారం రూరల్ సీఐ నిరంజన్ ఫోన్‌ను లక్ష్మీనరసింహకు అప్పగించారు. ఈ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

# ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం




**దేవరకొండ, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్‌వీటీ సభ్యులతో కలిసి అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. 1959లో అక్టోబర్ 21న డీఎస్పీ కరణ్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్‌కు చెందిన 21 మంది సీఆర్పీఎఫ్ బృందం అక్షయ్ చిన్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండగా, చైనా బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు యత్నించాయి. ఆట్ స్ప్రింగ్ వద్ద జరిగిన ఎదురుదాడిలో పది మంది జవాన్లు ప్రాణాలు అర్పించారు. వారి త్యాగాలను స్మరించుకోవడమే ఈ దినోత్సవ ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు.అమరవీరుల త్యాగాలు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ ఈ రోజు వారి సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, రాపోలు నిరంజన్, బత్తుల అమర్, భాస్కర్ రెడ్డి, ఆర్మీ శ్రీనయ్య, శేఖర్, కరాటే మాస్టర్స్ గోపి, చైతన్య, జమీర్, మధు, విజయ్, సంతోష్, సాత్విక్, గౌతం, అతి రామ్, భగవాన్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసిన అయ్యప్ప దేవాలయ ప్రతినిధులు



**కొంపల్లి, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శ్రీనివాస్ నగర్ శ్రీ ధర్మశాస్త్ర శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కేపీ వివేకానందకు అందజేశారు. ఈరోజు ఆయన నివాసంలో దేవాలయ ఛైర్మన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ట్రస్ట్ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, నాయకులు ఆవుల ఎల్లయ్య కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 10 వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో స్వాములకు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీనివాస్ నగర్ దేవాలయంలో మాన్యశ్రీ అరుణ్ గురు స్వామి ముఖ్య అతిథిగా, కే. నాగార్జున ఆచార్యులు (లాలు స్వామి) చేతుల మీదుగా అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం 'ఫ్లాగ్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా పేరుగాంచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 47 మంది పోలీసు అధికారులకు ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై, అమరవీరుల త్యాగాలను స్మరించారు. "పండుగల సమయంలో ప్రజలు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతుంటే, పోలీసులు మాత్రం విధుల్లో నిమగ్నమై ప్రజల రక్షణ కోసం సేవలందిస్తున్నారు. అవసరమైతే ప్రాణాలను సైతం త్యాగం చేస్తారు" అని ఆమె పేర్కొన్నారు. పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, "ఉమ్మడి కరీంనగర్ జిల్లా నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేది. ఎన్నో ప్రాణత్యాగాల ఫలితంగా ఈ రోజు ప్రజలు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారు. జిల్లాలో 47 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. దేశవ్యాప్తంగా 191 మందికి పైగా అన్ని విభాగాల పోలీసు సిబ్బంది అమరులయ్యారు. వారి త్యాగాలు ఎప్పటికీ వృథా కావు" అని అన్నారు. అమరుల కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నెల 31 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం అమరవీరుల విగ్రహానికి సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. పోలీస్ కమీషనర్, ఇతర అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి హాజరైనవారంతా రెండు నిమిషాల మౌనం పాటిస్తూ అమరవీరులను స్మరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు వెంకటరమణ, భీం రావు, కమీషనరేటుకు చెందిన పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జీడిమెట్ల పోలీసుల మహా రక్తదానం యువతకు స్ఫూర్తి



**జీడిమెట్ల, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నగర శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతర సేవలందిస్తున్న జీడిమెట్ల పోలీసులు మహా రక్తదానం కార్యక్రమం ద్వారా వందలాది మంది ప్రాణాలకు రక్షకులుగా నిలిచారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 412 మంది స్థానికులు పాల్గొని రక్తదానం చేశారు. ఇందులో 146 యూనిట్లు నిమ్స్ బ్లడ్ బ్యాంకుకు, మిగతా రక్తం తలసేమియా, సికిల్ సెల్ సొసైటీకి అందజేశారు.ఈ సందర్భంగా మంగళవారం నిమ్స్ ఆసుపత్రిలో అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌తో కలిసి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌ను సన్మానించారు. "రక్తదానం ద్వారా వేలాది ప్రాణాలు నిలుస్తున్నాయి. యువతకు స్ఫూర్తినిచ్చేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం" అని డైరెక్టర్ పేర్కొన్నారు. అత్యవసర చికిత్సలు, అవయవ మార్పిడి సందర్భాల్లో రక్త కొరత సమస్యగా మారుతోందని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ, "రక్తదానం చేయడంపై చాలామందికి భయం ఉంటుంది. ఒక్కసారి చేసిన తర్వాత దాని విలువ తెలుసుకుని ప్రతిసారి ముందుకొస్తారు. ఆ భయాన్ని పోగొట్టేందుకు, రక్తదానం ప్రాధాన్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం" అని వివరించారు.

# వెనుకబడిన తరగతుల అభివృద్ధి బాధ్యతలు స్వీకరించిన భాగ్యవతి



**మంచిర్యాల, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిగా డి. భాగ్యవతి మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# సత్తు వెంకటరమణారెడ్డి నివాసంలో దీపావళి వేడుకలు



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించారు. సత్తు వెంకటరమణారెడ్డి బాణాసంచాలు కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చీకటిని జయించిన వెలుగుల పండుగ దీపావళి అజ్ఞానం పై జ్ఞానం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతికగా నిలిచే ఈ దీపావళి పండుగ అందరి జీవితాలల్లో వెలుగులు తీసుకురావాలని కోరుకుంటూ తెలుగు వారందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి



**మానకొండూరు, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం మానకొండూరు మండలంలోని వెల్ది పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్, మెడిసిన్ స్టోర్స్, వ్యాక్సిన్లు నిల్వ చేసే గది, లేబర్ రూమ్, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. పలు రిజిస్టర్లను పరిశీలించి, రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యాధికారి సాయి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళల స్క్రీనింగ్ పూర్తయి ఆరు నెలలు గడిచిన వారికి మరో దఫా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నూరు శాతం మందికి పరీక్షలు పూర్తిచేయాలని, గర్భిణీలకు ప్రసవాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బిపి, షుగర్ వంటి వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతినెలా ఉచిత మందులు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రత పాటించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ వెంకటరమణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, వైద్యులు సాయి ప్రసాద్, వెంకటేష్, తహసీల్దార్ విజయ్ తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దీపావళి పండుగను పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలో, ముఖ్యంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆసక్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పలు పనులకు సంబంధించిన ఫైల్స్ వివరాలను ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## శ్రీ మహాశక్తి దేవాలయానికి పోటెత్తిన భక్తుల



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని మహిమాన్విత శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు అశేషంగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయం జనసంద్రంగా మారింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వాముల ఆశీస్సులతో ఆలయంలో లక్ష్మీ కుబేర హోమం, పూర్ణాహుతి, మహాహారతి, మహాభిషేకం, మంగళద్రవ్యాభిషేకం వంటి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ధన త్రయోదశి, నరక చతుర్దశి, దీపావళి సందర్భంగా అమ్మవార్లకు నాణాలతో పూజలు, పుష్పాభిషేకాలు నిర్వహించగా, వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి అలంకరించిన కరెన్సీ నోట్లు, గాజులు, కుంకుమ, అమ్మవారి ఫోటోలను దీపావళి సందర్భంగా పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు మహాప్రసాదంగా అందజేశారు. శ్రీ మహాలక్ష్మి దేవిని దీపావళి రోజున పూజించడం వల్ల సంపద, శ్రేయస్సు, ఐశ్వర్యం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. దేవాలయంలో చేపట్టిన పూల అలంకరణ, విద్యుత్ దీపాల వెలుగులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అధ్యక్షతన మంగళవారం తన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో కలిసి అయోడిన్ వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అయోడిన్ ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ, మెదడు అభివృద్ధికి, శారీరక ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపుకు, గర్భిణీ స్త్రీలు మరియు పిల్లల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరమని వివరించారు. “అయోడిన్ కలిగిన ఉప్పునే వాడండి – అందరి ఆరోగ్యాన్ని కాపాడండి” అని పిలుపునిచ్చారు. అయోడిన్ లోపం వల్ల గొయిటర్ (మెడ ఉబ్బరం), మానసిక మందగమనము, బలహీనత, అలసట, గర్భిణీ స్త్రీలలో మృత శిశువు జననం, పిల్లల్లో వికలాంగత వంటి సమస్యలు కలుగుతాయని తెలిపారు. “అయోడిన్ కలిగిన ఉప్పు ం ఆరోగ్యానికి మిత్రుడు” అని పేర్కొన్నారు. తదుపరి, పిఓ ఎన్సిడి డాక్టర్ విప్లవ శ్రీ మాట్లాడుతూ, “15 పీపీఎం అయోడిన్ కలిగిన ప్యాక్ ఉప్పు మాత్రమే వాడాలి. ‘ఇడిజ్డ్ సాల్ట్’ అని ప్యాకెట్‌పై ఉన్నదో చూసుకోవాలి. వంట చివరిలో ఉప్పు వేయడం ద్వారా అయోడిన్ నిల్వ ఉండి శరీరానికి చేరుతుంది” అని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విప్లవ శ్రీతో పాటు డిటిసిఓ డాక్టర్ రవీందర్ రెడ్డి, డిఐఓ డాక్టర్ సాజిద్, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియా, డెమో రాజగోపాల్, డిపిఓ స్వామి, సూపర్వైజర్ పోచయ్య మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టిన రోజు సందర్భంగా కేటీఆర్ ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే వివేకానంద్



**హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీఆర్ఎస్ ఎల్పీ విప్, కొంపల్లి ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పరికె చెరువు కబ్జాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జగద్గిరిగుట్ట 126వ డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో ఉన్న పరికె చెరువు కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మంగళవారం చెరువును సందర్శించారు. చెరువును ఆక్రమిస్తున్న వ్యక్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, హైడ్రా కమిషనర్‌ను కోరారు. అలాగే, చెరువు చుట్టూ కంచ వేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. చెరువు పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, రషీద్, కృష్ణ గౌడ్, లక్ష్మ రెడ్డి, గోరె భాయ్, నరేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రయ్య, బేకు శ్రీనివాస్, పండరి, సోమన్నా శ్రీధర్ రెడ్డి, ఎం.డి. జాకీర్, సంతోష్, ఎం.డి. లాయక్, పెరిక శివ, భరత్ గౌడ్, వేణు గౌడ్, పిల్లి ఆంజనేయులు, మహిళా నాయకులు కౌసల్య, అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా దీపావళి వేడుకలు



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ పట్టణంలో దీపావళి పర్వదినాన్ని ప్రజలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే గృహాల్లో కేదారేశ్వర వ్రతాలు, వ్యాపార సంస్థల్లో ధనలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి టపాసులు పేల్చుతూ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. రంగుల దీపాలతో అలంకరించిన వీధులు, వెలుగులతో మెరిసిన గృహాలు, ఆనందోత్సాహంతో నిండిన వాతావరణం దీపావళిని కన్నుల పండుగగా మార్చింది.

## కరీంనగర్‌లో జాగృతి జనం బాట కార్యక్రమానికి విశేష స్పందన




**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జాగృతి అధ్యక్షురాలు కవితా గారు చేపట్టబోయే జనం బాట కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలో విజయవంతం చేయాలని జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్. రూప్ సింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “కరీంనగర్ జిల్లా ఉద్యమాలకు ఖిల్లా. ఇక్కడి ప్రజల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకొని, జాగృతి బలోపేతానికి కవితక్క పర్యటన దోహదపడుతుంది” అని పేర్కొన్నారు. రెండు రోజులపాటు కవితా గారు జిల్లాలో పర్యటించి మేధావులు, కవులు, కళాకారులు, వ్యాపారవర్గాలు, కుల సంఘాల నాయకులు, ఉద్యోగులు, నిరుద్యోగులతో సమావేశమై వారి సూచనల మేరకు తెలంగాణ జాగృతిని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగనున్నారని తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులై తొలిసారి కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన రూప్ సింగ్‌ను జిల్లా జాగృతి తరఫున ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షత వహించగా, మహిళా విభాగం కన్వీనర్ అంకం శివరాణి, ఆరోగ్య విభాగం కన్వీనర్ మేకల తిరుపతి, స్టూడెంట్ వింగ్ కన్వీనర్ ఎంఎ రజీ, జిల్లా నాయకులు శ్రీరాముల రమేష్, రంగరవేణి లక్ష్మణ్, పొద్దిల్ల సదసందం, తోగోటి తిరుపతి, సురేందర్ రెడ్డి, దయ్యాల ఓంప్రసాద్, సంగీతారెడ్డి, అపర్ణ, హుస్సేన్, గాలిపెల్లి రత్నాకర, పూసల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి



**మంచిర్యాల, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ కరుణాకర్ తదితరులతో కలిసి కలెక్టర్ పాల్గొని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. “శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగాలు చేసిన పోలీసుల మార్గం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి. వారి కుటుంబాలకు అండగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉంది” అని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందెల ఆగమయ్యకు ఘన నివాళులు అర్పించిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు



**సరూర్‌నగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాముల తండ్రి అందెల ఆగమయ్య పార్థివ దేహానికి పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, మాజీ రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## అమరులైన పోలీసుల త్యాగాలకు సంకల్ప సంస్థ ఘన నివాళి



**కోహెడ, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున ఘన నివాళులు అర్పించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకుడు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, "శాంతి భద్రత పరిరక్షణకై ప్రాణత్యాగం చేసిన పోలీసులు సేవకు నిజమైన ప్రతీకలు. వారి త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. "నిశ్శబ్ద రాత్రుల్లో వెలిసే దీపశిఖలు వారు, భద్రత కోసం తలపెట్టే ఋషులు. కన్నీరు కరిగినా, కుటుంబం దూరమైనా, కర్తవ్య పథంలో వెనుకడుగు వేయని వీరులు. తుపాకి చేతిలో కాదు, హృదయంలో ధైర్యం. శాంతి కోసం సమర్పించిన జీవితం అంతా యజ్ఞం" అంటూ భావోద్వేగంతో స్పందించారు. అమరులైన పోలీసు యోధులను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "వారి త్యాగాన్ని ఒక్క రోజుతో మరిచిపోలేం. ప్రతి దినమూ మన గుండెల్లో నిలిచే జ్ఞాపకం. ప్రతి పోలీస్ జీవితం ఒక నిశ్శబ్ద గాథ, ఓ శాంతి యాత్ర" అని పేర్కొన్నారు.

## సత్యనారాయణ స్వామి వ్రతం లో శ్రీనివాస్ గౌడ్ దంపతులు

-దైవ కార్యం మానసిక ప్రశాంత మానవ మనుగడ కు నాంది
-టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, అక్టోబర్ 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
దీపావళి పండుగ సందర్భంగా సుబ్రహ్మణ్యం నగర్ కాలనీ లో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పద్మశ్రీ దంపతులు మంగళవారం సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం లో జయప్రకాశ్ జైన్ ప్రభావతి దంపతులు, లక్ష్మమ్మ, సుదర్శన్ కరుణశ్రీ, రాజు, రవి, రాజేష్, సురేందర్, జగన్, కరుణశ్రీ, ఉమాదేవి, రేణుక దేవి,కల్పనా దేవి, హేమ,శిరీష,సాధన, ఫలానీష్, సుగంధ్, అభి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ చదరంగం పోటీలోకి విశృత్ రామ్ ఎంపిక




**ఎలిగేడు, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి విశృత్ రామ్ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -14 చదరంగం పోటీలోకి ఎంపికయ్యాడు. మంగళవారం పెద్దపెల్లి కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనాడు. విశృత్ రామ్‌ను పలువురు అభినందించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల స్థానికంగా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

# యువత క్రీడల్లో రాణించాలి

## కడ్తాల్ సీఐ గంగాధర్



**కడ్తాల్, అక్టోబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని కడ్తాల్ సీఐ గంగాధర్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రెండు రోజులపాటు సాగిన ఈ పోటీలలో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి.
హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటి బహుమతి కడ్తాల్ టౌన్ జట్టు, రెండవ బహుమతి సలార్పూర్ గ్రామ జట్టు, మూడవ బహుమతి రావిచేడ్ గ్రామ యువకులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి ఇన్స్పెక్టర్ గంగాధర్ , ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, పీఈటీ భీముడు, ఫార్చ్యూన్ బటర్ఫ్లై సిటీ నిర్వాకుడు లక్ష్మణ స్వామి , మరియు పోలీస్ సిబ్బంది, గ్రామ యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా ఆటలు ఆడుతూ క్రమశిక్షణతో మెదగాలని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలని సూచించారు. అలాగే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆటలతో పాటు పాఠశాల విద్యలోను ప్రతిభ చూపించాలని సూచించారు. కార్యక్రమం ప్రారంభంలో పోలీస్ అమరవీరుల స్మారకార్థం రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఫార్చ్యూన్ బటర్ఫ్లై సిటీ యజమాన్యం కి సీఐ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పోటీలలో పాల్గొన్న ప్రతి టీం, సభ్యుడు, మరియు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా పోలీస్ అమరవీరుల స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించి, ఎక్కువ సంఖ్యలో టీంలు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

## డీజేఎఫ్ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శిగా చింతకింది సింగర్

**హుస్నాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచిర్యాల జిల్లాలోని పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన డీజేఎఫ్ డబ్ల్యూ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం, కోహెడ మండలం సముద్రాల గ్రామానికి చెందిన చింతకింది సింగర్‌ను డీజేఎఫ్ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. అలాగే సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా బొద్దుల శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర కమిటీలో వీరికి స్థానం కల్పించిన జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్ అభినందనలందుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోరుపాక రాజు, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, డీజేఎఫ్ డబ్ల్యూ వర్కింగ్ జర్నలిస్టులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మంగళవారం విలేకరుల సమావేశంలో చింతకింది సింగర్ మాట్లాడుతూ, "డీజేఎఫ్ డబ్ల్యూ సంఘాన్ని బలోపేతం చేయడం నా బాధ్యత. వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాల కోసం, వారి పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 50% రాయితీ కల్పించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. "జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేసిన సమయంలో, సిద్దిపేట జిల్లాలో జర్నలిస్టు పిల్లలకు 50% రాయితీ కోసం డీఈవోకు వినతిపత్రం సమర్పించాం. ప్రస్తుతం ఆ రాయితీ అమలవుతోంది. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని సూచించారు. 'హుస్నాబాద్‌లో పాదయాత్ర నిర్వహించి ఇండ్ల స్థలాల కోసం ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చాం. జర్నలిస్టుల హక్కుల కోసం మరెన్నో కార్యక్రమాలు చేపట్టి, వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తాను" అని స్పష్టం చేశారు.

# సింగరేణి ఆసుపత్రి నిర్లక్ష్యంతో గర్భంలోనే శిశువు మృతి

**గోదావరిఖని, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గోదావరిఖని 7 ఎల్‌బీ కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు కొంపెల్లి లింగయ్య తన కూతురు సుప్రియను ప్రసవం కోసం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెకు ఉమ్మనీరు పోతుందని పునరుద్ఘాటించినా, వైద్యులు పట్టించుకోకుండా ప్రైవేట్ ఆసుపత్రికి స్కానింగ్ కోసం రిఫర్ చేయగా, గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు ఆసుపత్రి సూపరిండెంట్ చాంబర్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ, "ఒకే కుటుంబం-ఒకే లక్ష్యం అని చెప్పే సింగరేణి యాజమాన్యం కార్మిక కుటుంబాల పట్ల నిర్లక్ష్యంగా



వ్యవహరిస్తోంది. 15 లక్షల రూపాయల వ్యయంతో స్కానింగ్ మిషన్ ఉన్నప్పటికీ, రేడియాలజిస్ట్‌ను నియమించకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పంపించడం బాధాకరం" అని విమర్శించారు. "మాతృత్వం ప్రతి తల్లికి వరం. అలాంటి మాతృత్వాన్ని చిదిమేసిన వైద్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి" అని డిమాండ్ చేశారు. ధర్నా నేపథ్యంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అంబిక స్పందించి, డ్యూటీ డాక్టర్, గైనకాలజిస్ట్‌పై సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంఘటనపై స్పందించిన ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆసుపత్రికి చేరుకుని, సంబంధిత వైద్యుల నిర్లక్ష్యాన్ని పరిశీలించారు. వెంటనే రేడియాలజిస్ట్‌ను నియమించాలని కార్మికుల తరఫున వివరించారు. జీఎం లలిత్ కుమార్ డైరెక్టర్ పర్సనల్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి, రేపటినుంచి రేడియాలజిస్టులను హైర్ చేయాలని ఆసుపత్రి సూపరిండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. బిడ్డను కోల్పోయిన మాతృమూర్తికి మనోధైర్యం కల్పించాలని కోరుతూ, సంఘటనపై బాధను వ్యక్తం చేశారు.

## రాయణరావుపేట పిఎచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**సిద్దిపేట, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాయణరావుపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. మరమ్మతుల



కారణంగా ఆయుష్ కేంద్రంలో సేవలు అందిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అటెండెన్స్, ఓపి, మూవ్మెంట్ రిజిస్టర్లు పరిశీలించిన కలెక్టర్, విధులకు గైర్హాజరైన మెడికల్ ఆఫీసర్, హెచ్‌ఈపై కఠిన చర్యలకు డీఎంఅండ్‌ఎచ్‌ఓను ఆదేశించారు. "వృత్తికి న్యాయం చేయాలి, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.

## హర్యానా గవర్నర్‌ను కలిసిన తల్లోజు ఆచారి



**హైదరాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను బీజేపీ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 31న తన కుమారుడు భారత్ నిశ్చితార్థం కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో, ఆచారి గవర్నర్‌ను స్వయంగా ఆహ్వానించారు.

# జ్యోతిరావు పూలే విగ్రహ ధ్వంసం

## బీసీ అజాది ఫెడరేషన్ తీవ్ర ఖండన



**హుజురాబాద్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉర్సు దర్గా ప్రాంతంలో సామాజిక సంస్కరణకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం పట్ల బీసీ అజాది ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్ తీవ్రంగా స్పందించారు. "జ్యోతిబావు పూలే అణగారిన వర్గాలకు విద్య, సమానత్వం, హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానీయుడు. ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేయడం సామాజిక విలువలపై దాడి చేసినట్టే. ఇది అత్యంత ఘోరమైన చర్య" అని పేర్కొన్నారు.ఈ ఘటనపై పోలీస్ అధికారులు వెంటనే స్పందించి, దోషులను అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. "లేకపోతే జిల్లావ్యాప్తంగా బీసీ అజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో బహుళ స్థాయిలో ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు.

# హుస్నాబాద్ ఆసుపత్రి అభివృద్ధి పై మంత్రి సమీక్ష



**హుస్నాబాద్, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రూ.82 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో ఆసుపత్రి నిర్మాణం వేగంగా కొనసాగుతోంది.ప్రస్తుతం హుస్నాబాద్ ఆసుపత్రిలో 8 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. భవిష్యత్తులో జిల్లా కేంద్ర స్థాయిలో 38 మంది వైద్యులతో 250 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. నర్సింగ్ కాలేజీ ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆరోగ్య రంగంతో పాటు వ్యవసాయం, ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి హుస్నాబాద్‌లో కృషి కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. గౌరవెల్లి కాలువల పనులకు భూసేకరణ జరుగుతున్న నేపథ్యంలో రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టూరిజం అభివృద్ధికి మహాసముద్రం గండి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.క్యాన్సర్ నివారణకు పొన్నం సత్తయ్య ట్రస్టు ద్వారా మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులతో స్టీల్ పాత్రలు పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో నెంబర్ వన్ ఆసుపత్రిగా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# అమరుల త్యాగాలకు ఘన నివాళి



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల స్థూపం వద్ద కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా పోలీసు అధికారి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. "శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు అమూల్యమైనవి. వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి. ప్రజల సంక్షేమానికి శాంతి అవసరం. పోలీసుల సేవలు ప్రతి సందర్భంలో కీలకమైనవి" అని కలెక్టర్ పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించినట్లు తెలిపారు."అమరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. శాంతి, సామాజిక సమైక్యత కోసం పోలీసు వ్యవస్థ నిరంతరం కృషి చేస్తోంది" అని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప పోలీసు అధికారి బుర్రి శ్రీనివాసులు, అచ్చంపేట ఉప పోలీసు అధికారి పల్లె శ్రీనివాసులు, కల్వకుర్తి ఉప పోలీసు అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఉప సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, అమరుల కుటుంబాలు పాల్గొన్నారు.

# ఎలిగేడు లో పోలీస్ అమరవీరుల సంస్మరణ

## -కొవ్వొత్తులతో నివాళులు, సెల్యూట్ చేసిన యువత



**ఎలిగేడు, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువత కొవ్వొత్తులతో నివాళులు అర్పించి, అమరవీరులకు సెల్యూట్ చేశారు. 1959లో లడక్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సైన్యం దాడిలో వీరమరణం పొందిన 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ సిబ్బందికి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ఎస్ఐ మధుకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కప్పల ప్రవీణ్, రాకేష్, మల్లేష్, శ్రీకాంత్, వంశీ, నాగేంద్ర, తిరుపతి, ఓదెలు, నంబయ్య, శ్రావణ్, సత్యం, నరేందర్, కార్తీక్, శ్రీధర్, బన్ని, శ్రీనివాస్, రమేష్, సంతోష్, నాగరాజు, వెంకటేష్, సచిన్, రాజు, అజయ్, వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



**దేవరకొండ, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గుర్తు తెలియని మగ శవం కనిపించింది. సుమారు 55 సంవత్సరాలు పైబడిన వ్యక్తిగా భావిస్తున్నారు. బిచ్చగాడు వలె ఉండి, ఎత్తు 5.5 అడుగులు, లేత గోధుమరంగు గీతలతో కూడిన టీషర్ట్ ధరించి ఉన్నాడు. గుబురు గడ్డం, జూలపాల జుట్టు కలిగి ఉన్నాడు. ఈ వ్యక్తిని ఎవరికైనా పరిచయం ఉంటే, దేవరకొండ సీఐ నెం. 8712670154 లేదా ఎస్ఐ నెం. 8712570236 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్‌హెచ్ఓ దేవరకొండ పోలీస్ వారు విజ్ఞప్తి చేశారు.

# గంభీరావుపేట అభివృద్ధికి కేంద్ర నిధులతో ఊపిరి



**గంభీరావుపేట, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పట్టణ కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర మంత్రి నిధుల ద్వారా కీలక అభివృద్ధి చర్యలు చేపట్టారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి వద్ద స్థానిక నాయకులు తాగునీటి సమస్యను వివరించగా, వారు వెంటనే స్పందించారు. ఎంపీ నిధుల నుంచి రూ.2 లక్షలు కేటాయించి, రెండు బోర్లు, మోటార్లకు అనుమతి మంజూరు చేశారు. ఈ మేరకు బీజేపీ గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో బీసీ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ వద్ద ఒక బోరు మోటారు, గాంధీ విగ్రహం సమీపంలోని జిపి వాటర్ ట్యాంక్ వద్ద మరో బోరు మోటారు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు అడగగానే స్పందించిన ఎంపీ బండి సంజయ్, మండల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు మండల అధ్యక్షుడు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి గంభీరావుపేట మండల బీజేపీ శాఖ తరఫున, గ్రామస్తుల తరఫున ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు గంట అశోక్, నాగరాజు గౌడ్, సర్వోత్తమ్, కిషన్ రావు, డాక్టర్ సత్యనారాయణ, దేవేందర్ యాదవ్, నర్సింలు, నరేష్, స్వామి, హనుమాన్లు, రాజేష్ స్వామి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



**కరీంనగర్, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొత్తపల్లి గ్రామంలోని ముస్లిం కబ్రిస్తాన్‌కు ప్రహరీ గోడ నిర్మాణం అవసరమని కోరుతూ కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ అజీమ్ మంగళవారం రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దర్గా హజ్రత్ సయ్యద్ అహ్మద్ షా వలీ రహ్మతుల్లా అలయ్, దర్గా హజ్రత్ సయ్యద్ హబీబ్ షా వలీ రహ్మతుల్లా అలయ్ పరిసరాల్లోని కబ్రిస్తాన్‌కు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. "ప్రస్తుతం కబ్రిస్తాన్ చుట్టూ గోడ లేకపోవడంతో పశువులు ప్రవేశించడం, చెత్త పడేయడం వంటి సమస్యలు ముస్లిం సమాజానికి తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని అజీమ్ పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపత్రం స్వీకరించి, సమస్యను సమీక్షించి సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన ప్రతినిధులు, ముస్లిం కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయం



**భూపాలపల్లి, అక్టోబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ భద్రత, ప్రజారక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని, అవి సమాజానికి నిత్య స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు (జి.ఎస్.ఆర్) పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిరణ్ కరేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "మనము స్వేచ్ఛగా, భయరహితంగా జీవించగలుగుతున్నామంటే అది పోలీసుల నిబద్ధతతో కూడిన సేవల ఫలితం. నిత్యం పెరుగుతున్న నేరాలను అదుపు చేయడంలో వారు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్నారు" అని ప్రశంసించారు. అమరులైన పోలీస్ వీరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు బహుమతులు అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన పోలీస్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, జిల్లా అటవీశాఖ అధికారి, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపాలిటీ అభివృద్ధికి 50 కోట్ల నిధులు

## - సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**భూపాలపల్లి, అక్టోబర్ 21**
భూపాలపల్లి మునిసిపాలిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఇనుముల రేవంత్ రెడ్డి 50 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరై, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "భూపాలపల్లిని ఆధునిక మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ నిధులతో రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యాలు, పట్టణ సౌందర్య వృద్ధి, ప్రధాన జంక్షన్ల విస్తరణ, అమృత్సర్ స్కీం కింద 23 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి" అని వివరించారు. అదేవిధంగా అంబేద్కర్ భవనానికి ఐదు కోట్ల రూపాయలు, గిరిజన భవనానికి కోటి రూపాయలు కేటాయించామని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, పీసీసీ సభ్యులు చల్లూరి, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూనె గింజల సాగుకు కలెక్టర్ ప్రోత్సాహం

**-అక్కన్నపేటలో 100% సబ్సిడీతో విత్తనాల పంపిణీ**
**-అంతక్కపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలన**





**హుస్నాబాద్, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకం కింద అక్కన్నపేట మండల రైతులకు 100 శాతం సబ్సిడీతో పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అక్కన్నపేట రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 253 మంది రైతులకు 500 ఎకరాల సాగు కోసం విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కే. లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్, వ్యవసాయ శాఖ అధికారులు, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "జిల్లాలో నూనె గింజల సాగును ప్రోత్సహించేందుకు అనువైన ప్రాంతాలను వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాతో గుర్తించాం. హుస్నాబాద్ నియోజకవర్గ వాతావరణం పొద్దుతిరుగుడు పంటకు అనుకూలంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశాం. వరి మాత్రమే సాగు చేయడం వల్ల భూమి సారాన్ని కోల్పోతుంది. పంట మార్పిడి అవసరం. నూనె గింజల దిగుమతులు తగ్గించి, మన రైతులే ఎగుమతిదారులుగా మారేలా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు. ప్రతి హెక్టారుకు 5 కిలోల విత్తనాలు అందజేస్తున్నామని, 90 రోజుల్లో తక్కువ నీటితో పండే ఈ పంట రైతులకు లాభదాయకమని వివరించారు. ఎఫ్‌పీఓల సహకారంతో రైతుల సందేహాలను నివృత్తి చేస్తామని తెలిపారు. అంతక్కపేట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమ శాతం తగినంతగా ఉన్న ధాన్యాన్ని గన్నీలలో నింపి, వెంటనే లారీలలో లోడ్ చేయాలని సూచించారు. తూకంలో ఎలాంటి తేడా లేకుండా చూడాలని, గన్నీ బ్యాగులను ప్రతిరోజూ పరిశీలించి డ్యామేజ్ ఉంటే అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ జరగాలని అధికారులను ఆదేశించారు.

# పాకిస్థాన్‌లో దీపావళి వేడుకలు.. వీడియో వైరల్



**ఢిల్లీ - అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాకిస్తాన్‌లో హిందూ సమాజం దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంది. దీపావళి వేడుకల సందర్భంగా ఆ దేశ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఇంట్లో ప్రత్యేక విందును ఏర్పాటు చేయగా.. ఈ కార్యక్రమంలో హిందూ, క్రైస్తవ సభ్యులతో పాటు ఇతర మతాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ప్రధాన మంత్రి దీపావళి కేక్ కట్ చేసి, ప్రార్థనలు చేసి, హిందూ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# వాషింగ్టన్‌తో అణు చర్చలు ఉండవు : ఖమేనీ



**టెహ్రాన్ అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అణు చర్చలు ప్రారంభిద్దామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ తోసిపుచ్చారు. ఈ ఏడాది జూన్‌లో జరిపిన వైమానిక దాడిలో ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేశామంటూ ట్రంప్ చేసిన వాదనను ఖండిస్తూ 'అలా కలలు కంటూనే ఉండండి' అని ఎద్దేవా చేశారు. తనతో కుదుర్చుకునే ఒప్పందం ఫలితాన్ని అమెరికా ముందుగానే నిర్దేశిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇరాన్, అమెరికా దేశాలు ఐదు విడతలుగా పరోక్ష అణు చర్చలు జరిపాయి. జూన్‌లో 12 రోజుల పాటు అమెరికా జరిపిన వైమానిక దాడులతో అవి నిలిచిపోయాయి. ఆ సమయంలో ఇజ్రాయిల్, అమెరికా దళాలు ఇరాన్ అణు స్థావరాలపై బాంబు దాడులు జరిపిన విషయం తెలిసిందే. 'ఒప్పందాన్ని తానే రూపొందిస్తానని ట్రంప్ అంటారు. అయితే బలవంతంగా రుద్దినప్పుడు, దాని ఫలితాన్ని ముందుగానే నిర్ణయించినప్పుడు అది ఒప్పందం ఎలా అవుతుంది? అది బలవంతంగా రుద్దడం లేదా బెదిరించడం అవుతుంది' అని ఖమేనీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఉమ్మడి జిల్లాల్లో అమరుల త్యాగాలకు ఘన నివాళి



**మహబూబాబాద్, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి సుధీర్ రాంనాథ్ కేకన్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

**జగిత్యాల:**
జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా పోలీసు అధికారి అశోక్ కుమార్, ఉప పోలీసు అధికారులు, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. "పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమైనవి" అని ఎస్పీ పేర్కొన్నారు.

**రాజన్న సిరిసిల్ల:**
చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి మహేష్ బి గీతే మాట్లాడుతూ "అమరవీరుల త్యాగఫలం వల్లే భద్రతా పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయి. వారి స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో మరణించిన 192 మంది అమరవీరుల పేర్లను చదివి వినిపించారు.

**నిర్మల్:**
జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారి జానకి షర్మిల పాల్గొని, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. "దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వారు మహావీరులు" అని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు.

# నకిలీ యాప్‌లపై అప్రమత్తంగా ఉండండి

**-కరీంనగర్ కమిషనరేట్ పోలీసు కమిషనర్ హెచ్చరిక**




**కరీంనగర్, అక్టోబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాట్సాప్ గ్రూపుల ద్వారా నకిలీ ఆర్టీవో చలాన్, టీఎస్ చలాన్, పీఎం కిసాన్, ఐఎస్బీఐ యోనా వంటి ఏపీకే ఫైళ్లను సర్క్యులేట్ చేస్తూ సైబర్ నేరస్థులు మోసాలకు పాల్పడుతున్నారని కరీంనగర్ కమిషనరేట్ పోలీసు కమిషనర్ హెచ్చరించారు. అటువంటి ఫైళ్లను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసినప్పుడు, హానికరమైన సాఫ్ట్‌వేర్ మొబైల్‌లో స్వయంచాలకంగా నడుస్తూ, ఓటీపీలు, సందేశాలను నేరస్థులకు ఫార్వార్డ్ చేస్తుంది. దీంతో బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు మోసపూరితంగా ఉపసంహరించుకుంటున్నారు. వాట్సాప్ ఖాతాలను కూడా హ్యాక్ చేస్తున్నారు. పౌరులు అప్రమత్తంగా ఉండాలి. తెలియని ఏపీకే ఫైళ్లను క్లిక్ చేయవద్దు, ఇన్‌స్టాల్ చేయకూడదు. పోలీసు లేదా ప్రభుత్వ వనరుల నుండి వచ్చినట్లు కనిపించినా, అనుమానాస్పద ఫైళ్లను తెరవకూడదు.

**అనుకోకుండా ఇన్‌స్టాల్ చేసినట్లయితే:**
-మొబైల్‌ను ఫ్లైట్ మోడ్‌కు మార్చాలి
- ఫైల్‌ను తొలగించాలి
- ##002# డయల్ చేసి సందేశ ఫార్వార్డింగ్ నిలిపివేయాలి
-1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి

# విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్







(మొదటి తరువాయి)

అభివృద్ధి శాఖ మంత్రి కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాక వేలాది మంది కి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, ముఖ్యమంత్రి విజన్ ఉన్న నాయకుడని తదనుగుణంగా అధికారులు పనిచేయాలని గ్రామీణ ప్రాంతాలలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమ కోసం క్రమశిక్షణతో పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి శ్రమిస్తే మీరు ఈ స్థాయికి వచ్చారని, మంచి పాలన అందించి ప్రభుత్వానికి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మంత్రి అన్నారు. హాస్టల్ విద్యార్థులకు మంచి చదువుని ఇచ్చి మంచి భవిష్యత్తును ఇవ్వాలని మంత్రి కోరారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంత్రి లక్ష్మణ్ కుమార్ చొరవ తో గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బిఏఎస్) పథకానికి సంబంధించిన 25 శాతం నిధులను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి ఇప్పించారని అభినందించారు. హాస్టల్ విద్యార్థులకు 40% మెస్ చార్జీలను 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని, సహకరించిన మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఏఎస్డబ్ల్యూఓ అధికారులకు అభినందనలు తెలిపారు.

ఎస్సీడిడి సెక్రెటరీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ఏఎస్డబ్ల్యూ ఓ అధికారులు గా నియమితులైన వారందరూ వృత్తి రీత్యా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, హాస్టల్ విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని, ఇంతటితో ఆగకుండా గ్రూపు 1 అధికారులుగా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సిడిడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్య సాచి గోష్ తదితరులు హాజరయ్యారు. ఎస్సిడిడి కమిషనర్ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ కార్యక్రమానికి స్వాగతం పలుకగా, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి వందన సమర్పణ చేయగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు. ఏఎస్డబ్ల్యూఓ లుగా నియమితులైన వారికి ఈ సందర్భంగా మంత్రి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నూతనంగా నియమితులైన గ్రూప్ 2 అధికారులు మంత్రి అట్లూరు లక్ష్మణ్ మరియు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు కు శాలువా కప్పి ధన్యవాదాలు తెలిపి మంత్రి ఆశీస్సులను తీసుకున్నారు.

# బిజినెస్

## టాటా మోటార్స్ దూకుడు. నెల రోజుల్లో లక్షకుపైగా డెలివరీలతో సరికొత్త రికార్డు..!

భారత్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ సరికొత్త రికార్డును సృష్టించింది. దాదాపు నెల రోజుల్లోనే లక్షకుపైగా కార్లను డెలివరీ చేసింది. నవరాత్రుల నుంచి దీపావళి మధ్యకాలంలో కంపెనీ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి అమ్మకాలు 33శాతం వరకు పెరిగాయని టాటా మోటార్స్ చెప్పింది. జీఎస్టీ తగ్గింపుతో పాటు పండుగ సమయంలో డిమాండ్ కారణంగా అమ్మకాలు భారీగా పెరిగాయి. కంపెనీ యూఎస్‌వీ మోడల్స్‌కు ఫుల్ డిమాండ్ కనిపించింది. ఈ సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర మాట్లాడారు. నవరాత్రుల నుంచి దీపావళి మధ్య నెల రోజుల్లో లక్షకుపైగా వాహనాల డెలివరీలతో చారిత్రక మైల్‌స్టోన్ చేరామన్నారు.ఎస్‌యూవీలు ఈ వృద్ధిని ముందుకు నడిపించాయన్నారు. కంపెనీ విక్రయించిన వాహనాల్లో అత్యధికంగా నెక్సాన్ మోడల్‌ను డెలివరీ చేసింది. 38వేల యూనిట్లతో




73శాతం వృద్ధిని నమోదు చేసింది. అలాగే, టాటా పంచ్ 32వేల యూనిట్లతో 29శాతం వృద్ధిని సాధించినట్లు చెప్పింది. ఎస్‌యూవీలతో పాటు ఈవీ విభాగంలోనూ భారీగానే డెలివరీలు చేసింది. నెల రోజుల పండుగ సీజన్ సమయంలో దాదాపు 10వేలకుపైగా ఈవీ కార్లను డెలివరీ చేసినట్లు చెప్పింది. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు 37శాతం పెరిగాయని.. ఈ విజయంతో మిగతా కాలంలోనూ మంచి ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నామని.. రాబోయే రోజుల్లో కొత్త మోడల్స్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా సీఈవో తెలిపారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంచనా ప్రకారం.. ఈ సీజన్లో భారీగా అమ్మకాలు జరిగాయి. ధనత్రయోదశి రోజున అన్ని కంపెనీలు కలిసి ఒకేరోజు లక్షకుపైగా వాహనాలను డెలివరీ చేశాయి. మార్కెట్‌లో వీటి విలువ రూ.8500 కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

## స్టాక్ మార్కెట్‌లో స్పెషల్ మూరత్ ట్రేడింగ్..

### లాభాల్లో ముగిసిన సూచీలు..!



భారత స్టాక్ మార్కెట్ ప్రత్యేకంగా మూరత్ ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించింది. దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం మూరత్ ట్రేడింగ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. కొత్త హిందూ క్యాలెండర్ సంవత్సరం, విక్రమ్ సంవత్ ప్రారంభాన్ని సూచిస్తుంది. హిందూ క్యాలెండర్ ప్రకారం కొత్త ఆర్థిక సంవత్సరం స్వాగతం పలుకుతూ ఈ మూరత్ ట్రేడింగ్ నిర్వహించే విషయం తెలిసిందే. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ, ఎంసీఎక్స్, ఎన్‌సీడీఈఎక్స్ మూరత్ ట్రేడింగ్ మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రారంభమై 1.45 గంటలకు ముగిసింది. ఆ తర్వాత రియలిస్టెడ్ సెక్యూరిటీల ప్రీ ఓపెన్ సెషన్ 1.30 గంటల నుంచి 1.45 వరకు సాగింది.ఆ తర్వాత సాధారణ మూరత్ ట్రేడింగ్ సెషన్ 1.45 గంటలకు ప్రారంభమై.. 2.45 గంటలకు పూర్తయ్యింది. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 62.97 పాయింట్లు పెరిగి 84.426.34 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25.45 పాయింట్లు పెరిగి 25,868.60 వద్ద ముగిసింది. దాదాపు 2,720 షేర్లు లాభపడ్డాయి. 902 షేర్లు క్షీణించాయి. నిఫ్టీలో సిప్లా, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ లాభపడ్డాయి. అయితే కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఆసియన్ పెయింట్స్ నష్టపోయాయి. మెటల్, మీడియా, టెలికాం ఒక్కొక్కటి 0.3శాతం పెరగ్గా.. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది.

## మళ్లీ పెరిగిన బంగారం ధర.. మంగళవారం తులం ఎంతంటే ??


అటు.. మంగళవారం వెండి ధర మాత్రం స్వల్పంగా తగ్గింది. అక్టోబర్ 21, మంగళవారం నాటి ధరలు పరిశీలిస్తే.. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడ, నెల్లూరు, తిరుపతి, కాకినాడల్లో 24 కేరట్ల బంగారం ధర తులం రూ.1,35,180 రూపాయలుగా ఉంది. 22 కేరట్ల తులం పుత్తడి ధర రూ.1,25,180 రూపాయలుగా ఉంది. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.1,88,000 రూపాయలుగా ఉంది. ఢిల్లీలో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,920 ఉండగా, 22 కేరట్ల 10 గ్రాముల ధర రూ.1,21,850 ఉంది. ముంబైలో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,770 ఉండగా, 22 కేరట్ల 10 గ్రాముల ధర




రూ.1,21,700 ఉంది. చెన్నైలో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,090 ఉండగా, 22 కేరట్ల 10 గ్రాముల ధర రూ.1,22,900 ఉంది. బెంగళూరులో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,770 ఉండగా, 22 కేరట్ల10 గ్రాముల ధర రూ.1,21,700 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, రాజకీయ అనిశ్చిత నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దీంతో పసిడికి భారీ డిమాండ్ ఏర్పడింది. మరో వైపు వెండి ధరలు కూడా గత కొంతకాలంగా పరుగులు పెడుతున్నాయి. వెండి వినియోగం ఎక్కువ కావడంతో పాటు వెండి ని కూడా సురక్షితమైన పెట్టుబడిగా భావించడంతో వెండి ధరలు రోజు రోజుకీ పై పైకి చేరుకుంటున్నాయి.

## పాక్‌ను వణికించిన సఫారీలు.. వరుసగా ఐదో విజయం..!

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా జోరు కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు విజయాలతో సెమీస్ చేరిన ఆ జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ప్రేమదాస మైదానంలో వర్షం అంతరాయాల నడుమ సాగిన పోరులో.. పాక్‌పై 150 పరుగుల తేడాతో గెలుపొందింది సఫారీ టీమ్. మొదట కెప్టెన్ లారా వొల్వార్డ్(90), సునే లుస్(61), మరినే కాప్ (68 నాటౌట్)ల విధ్వంసంతో 312 రన్స్ కొట్టిన దక్షిణాఫ్రికా.. ఆ తర్వాత మరినే (3-20) విజృంభణతో పాకిస్థాన్‌ను వణికించింది. వర్షం పదే పదే అడ్డుపడగా.. 20 ఓవర్లలో లక్ష్యాన్ని 234గా సవరించారు. కానీ, పాక్ 83 రన్స్‌కే పరితమైంది.వరల్డ్ కప్‌ను ఓటమితో ఆరంభించిన దక్షిణాఫ్రికా .. వరుస విజయాలతో దూసుకుపోతోంది. బలమైన జట్లకు షాకిస్తూ సెమీస్ చేరిన సఫారీ జట్టు.. ఈసారి ఆల్‌రౌండ్ షోతో పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. దక్షిణాఫ్రికా బ్యాటర్ల విధ్వంసంతో డీలా పడిన పాకిస్థాన్ జట్టుకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ మునీబా అలీ(5)ని పేసర్ ఖాకా ఔట్ చేసి తొలి బ్రేకిచ్చింది. ఆరంభంలోనే వికెట్ పడడంతో సిద్రా అమిన్ (13), ఒమైమా సోహైల్ (6) జాగ్రత్తగా




ఆడారు. కాస్త కుదురుకున్నాక సిద్రా ఫోర్లతో అలరించింది. అయితే.. 7వ ఓవర్లో మరినే కాప్ రెండు వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టింది. మొదటగా సొహైల్‌ను ఎల్బీగా ఔట్చేసిన తను.. చివరి బంతిని సిద్రాను డగౌట్ చేర్చింది.


మరోసారి తన ప్రతాపం చూపిస్తూ అలియా రియాజ్(3)ను ఔట్ చేసిన కాప్ పాక్‌ను కష్టాల్లోకి నెట్టింది. నాలుగు వికెట్లు పడిన పాక్ జట్టు ఇక కోలుకోవడం కష్టమే అనుకున్నవేళ.. వర్షం మొదలైంది. దాంతో, లక్ష్యాన్ని 299కి కుదించారు. కానీ, వాన మరో రెండు సార్లు అంతరాయం కలిగించగా.. 20 ఓవర్లలో 234గా సవరించారు. కానీ, పాక్ 83 రన్స్‌కే పరిమితమై భారీ ఓటమి మూటగట్టుకుంది.

**దంచికొట్టిన లారా, డీక్లెర్క్**

వరల్డ్ కప్‌లో సెమీస్‌కు దూసుకెళ్లిన దక్షిణాఫ్రికా ఈసారి భారీ స్కోర్‌తో విరుచుకుపడింది. ప్రేమదాస మైదానంలో వర్షం అంతరాయం తర్వాత సఫారీ బ్యాటర్లు పాకిస్థాన్ బౌలర్లను ఊచకోత కోశారు. లారా వొల్వార్డ్(90) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. మరినే కాప్(68 నాటౌట్), సునే లుస్(61)లు అర్ధ శతకాలో రెచ్చిపోయారు. ఆఖర్లో డీక్లెర్క్(41) సిక్సర్ల మోతతో జట్టు స్కోర్ మూడొందలు దాటించింది. వీరందరి వీరబాదుడుతో 40 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 312 రన్స్ కొట్టింది.

## మెరిసిన హూప్.. సూపర్ ఓవర్లో విండీస్ జయకేతనం


మూడు వన్డేల సిరీస్‌లో వెస్టిండీస్ బోణీ కొట్టింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన రెండో వన్డేలో బంగ్లాదేశ్‌కు షాకిస్తూ.. సూపర్ ఓవర్లలో విండీస్ విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 214 పరుగుల ఛేదనలో షాయ్ హోప్ సేన.. స్కోర్ సమం చేసింది. దాంతో.. సూపర్ ఓవర్ ఆడించగా మొదట విండీస్ వికెట్ నష్టానికి 10 రన్స్ చేసింది. అనంతరం బంగ్లా వికెట్ కోల్పోయి 9 రన్స్ చేసింది. ఒకేఒక పరుగుతో గెలుపొందిన కరీబియన్ జట్టు సిరీస్‌ను 1-1తో సమం చేసింది.మిర్పూర్‌లో జరిగిన రెండో వన్డేలో విండీస్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. మొదట బంగ్లా సౌమ్యా సర్కార్ (45), రిచర్డ్ హొసేన్ (39 నాటౌట్) మెరుపులతో 213 రన్స్ చేసింది. ఛేదనలో



ఆతిథ్య జట్టు బౌలర్లను విజృంభణతో విండీస్ ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. ఓపెనర్లు విఫలంకాగా.. కెప్టెన్ షాయ్ హూప్ (53), కేసీ కార్టీలు (35) రాణించడంతో గెలుపు దిశగా సాగింది. అయితే.. రిషద్ హొసేన్ (3-42) తిప్పేయడంతో ఆలౌట్ ప్రమాదంలో పడింది.బంగ్లా బౌలర్లు టెయిలెండర్లను కట్టడి చేయడంతో 50 ఓవర్లకు విండీస్ కూడా 213 రన్స్ చేసింది. ఇరుజట్ల స్కోర్లు సమం కావడంతో. అంపైర్లు సూపర్ ఓవర్ ఆడించారు. బంగ్లా తరఫున పేసర్ ముస్తాఫిజుర్.. కరీబియన్ తరఫున అకీల్ హొసేన్‌లు సూపర్ ఓవర్ వేశారు. ఇరుజట్ల మధ్య అక్టోబర్ 23న మూడో వన్డే జరుగనుంది.

# స్పోర్ట్స్

## పంత్ వచ్చేస్తున్నాడు.. ఈసారి ఆటగాడిగా కాదు కెప్టెన్‌గా..!



టెస్టు స్పెషలిస్ట్‌గా ముద్రపడిన భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ వచ్చేస్తున్నాడు. ఈసారి అతడు ఆటగాడిగా కాదు కెప్టెన్‌గా మైదానంలోకి దిగనున్నాడు. అవును.. ఇంగ్లండ్ పర్యటనలో పాదం గాయంతో ఆటకు దూరమైన పంత్ కోలుకొని.. ఫిట్‌నెస్ సాధించాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికా తో జరుగబోయే టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం భారత ఏ జట్టు సారథిగా ఎంపికయ్యాడీ డాషింగ్ బ్యాటర్. సఫారీ ఏ జట్టుతో రెండు నాలుగు రోజుల మ్యాచ్‌కు పంత్ నేతృత్వం వహించనుండగా.. అతడికి డిప్యూటీగా యంగ్‌స్టర్ సాయి సుదర్శన్ వ్యవహరించనున్నాడు.అక్టోబర్ చివరి వారంలో దక్షిణాఫ్రికా ఏ జట్టు రెండు నాలుగు రోజుల మ్యాచ్‌ల కోసం భారత పర్యటనకు రానుంది. దాంతో.. మంగళవారం సెలెక్టర్లు పంత్ సారథిగా పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. తొలి నాలుగు రోజుల మ్యాచ్‌కు జూనియర్ ఆటగాళ్లనే ఎంపిక చేసినా .. రెండో మ్యాచ్‌లో స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు.

కేఎల్ రాహుల్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అకాశ్ దీప్‌తో పాటు సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్‌లు ఎంపికయ్యారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 2 వరకూ తొలి మ్యాచ్.. నంబర్ 6 నుంచి 9వ తేదీ వరకూ ఇదే మైదానంలో రెండో మ్యాచ్‌లో భారత ఏ, దక్షిణాఫ్రికా ఏ జట్లు తలపడనున్నాయి. నవంబర్‌లో దక్షిణాఫ్రికా సీనియర్ జట్టు మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత్‌కు రానుంది. నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు జరుగనుంది. టీమిండియాతో సఫారీ టీమ్ రెండు టెస్టులు, మూడు వన్డేలు, 5 టీ20లు ఆడనుంది.

తొలి నాలుగు రోజుల మ్యాచ్‌కు స్క్వాడ్ : రిషభ్ పంత్(కెప్టెన్, వికెట్ కీపర్), ఆయుష్ మాత్రే, ఎన్.జగదీశన్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్(వైస్ కెప్టెన్), దేవ్‌దత్ పడిక్కల్, రజత్ పాటిదార్, హర్ష్ దుబే, తనుష్ కొతియాన్, మానవ్ సుతార్, అన్షుల్ కంభోజ్, యశ్ ఠాకూర్, ఆయుష్ బదొని, సరన్ష్ జైన్.

రెండో నాలుగు రోజుల మ్యాచ్‌కు స్క్వాడ్ : రిషభ్ పంత్(కెప్టెన్, వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్(వైస్ కెప్టెన్), దేవ్‌దత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, హర్ష్ దూబే, తనుష్ కొతియాన్, ఖలీల్ అహ్మద్, గుర్నూర్ బ్రార్, అభిమన్యు ఈశ్వరన్, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్, ఆకాశ్ దీప్.